

బాసర భద్రతపై ఎస్పీ సమీక్ష

బాసర జ్ఞాన సరస్వతిదేవి ఆలయాన్ని జిల్లా ఎస్పీ జానకీషర్మిల శుక్రవారం సందర్శించారు. ఆలయ భద్రతపై సమీక్ష చేశారు.

10లో▸

'కడెం' గేట్లు ఎత్తివేత

కడెం: ఎగువన కురుస్తున్న వర్షాలతో కడెం ప్రాజెక్టులోకి మళ్లీ వరద పెరిగింది. శుక్రవారం సాయంత్రానికి 10,533 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు రెండు వరద గేట్లు ఎత్తివేసి 7,994 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్ట్‌పూర్తి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 698.525 అడుగుల నీరు ఉందని తెలిపారు.

గరిష్టం/కనిష్టం

31.5 /26.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వరలక్ష్మీ.. సిరులివ్వు



జిల్లాకేంద్రంలో వరలక్ష్మీవ్రతంలో మహిళలు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా పూలు, పండ్లతో అలంకరించారు. వ్రతం ఆచరించారు. పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. వరలక్ష్మీ సిరులివ్వు అని వేడుకున్నారు. అనంతరం ముత్తైదులను పిలిచి వాయినాలు ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని రాజశ్యామల పీఠంలో అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక హోమం నిర్వహించారు. పీఠం గురువు యోగి కృష్ణస్వామి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

కోదండరామ్‌ను కలిసిన టీజేఎస్ జిల్లా నాయకులు



ఎమ్మెల్సీ కోదండరామ్‌ను సన్మానిస్తున్న టీజేఎస్ జిల్లా చైర్మన్ విజయ్‌కుమార్

నిర్మల్‌ఖిల్లా: ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్‌ను ఆ పార్టీకి చెందిన జిల్లా నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. టీజేఎస్ జిల్లా చైర్మన్ ఆరేపల్లి విజయ్‌కుమార్ నేతృత్వంలోని నాయకుల కోదండరామ్‌ను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. నిర్మల్ జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లాకు చెందిన పలువురు టీజేఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రేపు రక్షాబంధన్

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రక్షాబంధన్ నిర్వహిస్తామని నిర్మల్ నగర సంఘ్ చాలక్ డాక్టర్ టి.ప్రమోద్ చంద్రారెడ్డి తెలిపారు. ఉదయం 8:30 గంటల నుంచి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని నారాయణ థియేటర్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యవక్తగా విద్యాభారతి క్షేత్ర ప్రధాన కార్యదర్శి ఆయాచితుల లక్ష్మణరావు, ముఖ్యఅతిథిగా గోనె జ్ఞానేశ్వర్ హాజరవుతారని వివరించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సభ్యులు, కార్యకర్తలు, హిందూ బంధువులు రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

గల్ఫ్ బాధితుడి ఆచూకీ

కనుగొనే దిశగా..

- వివరాలు 8లో▸



రవినగర్‌లో ఇంటి ముందు రోడ్డుపై వరదలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ కుటుంబం..

వాన.. వరద..

నిర్మల్‌లో ఉదయం పొడిగా ఉన్న వాతావరణం మధ్యాహ్నానికి ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. చిన్నగా మొదలైన వాన కాసేపటికే భారీ వర్షంగా మారింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి పట్టణంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగాయి. శివాజీచౌక్, మంచిర్యాల రోడ్డు, శాంతినగర్ చౌరస్తాల వద్ద ప్రధాన రహదారిపై మోకాలు లోతు వరద పారడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. శాస్త్రీనగర్ సమీపంలోని పెట్రోల్ బంకులోకి వరద చేరడంతో అమ్మకాలను నిలిపివేశారు. సాయంత్రం వరకూ వర్షం కొనసాగడంతో దినసరి కూలీలు, రోజూవారీ ఉపాధిపొందే కార్మికులు ఇబ్బంది పడ్డారు.

- నిర్మల్‌ఖిల్లా/నిర్మల్‌టౌన్



నిర్మల్ పట్టణంలో వరద నీటిలోనే వెళ్తున్న కలెక్టర్ వాహనం



మాజీమంత్రి ఇంటి పక్కనే ప్రధాన రహదారిపై వరదలో వాహనాలు



శాస్త్రీనగర్ పెట్రోల్ బంక్‌లోకి చేరిన వరద



నిర్మల్-ఖానాపూర్ ప్రధాన రహదారిపై వరదలో రోడ్డు దాటుతున్న మహిళలు

ఎన్నాళ్లీ అఘాయిత్యాలు!?

- కోల్‌కతాలో వైద్యురాలి ఘటనపై నిరసనల వెల్లువ
- ఆడపిల్లను బయటకు పంపడానికి జంకుతున్న తల్లిదండ్రులు
- మానవ మృగాలకు ఉరే సరన్న ప్రధాని మోదీ..
- బహిరంగంగా శిక్షించాలంటున్న జిల్లా వాసులు
- 24 గంటలు ఓపీ సేవలు బంద్: ఐఎంఏ



కోల్‌కతాలో హత్యకు గురైన ట్రైనీ డాక్టర్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వైద్య విద్యార్థులు

నిర్మల్: 'బేటా.. బాగున్నావారా..! ఏం చేస్తున్నావు. తిన్నావా..! జరజాగ్రత్త ఉండు బిడ్డా.. ఎక్కడికెళ్లినా.. మీ ఫ్రెండ్స్‌తో కలిసే వెళ్లు' అని ఓ తండ్రి హైదరాబాద్‌లో చదువుతున్న తన బిడ్డకు ఫోన్‌లో జాగ్రత్తలు చెబుతూనే ఉన్నాడు. కూతురు కల్పించుకుంటూ 'ఎందుకు నాన్నా.. ఇంతలా జాగ్రత్తలు చెబుతున్నావ్. నేను బాగానే ఉన్నా.. మీరేం ఫికర్ చేయకండి..' అంటూ ఆ బిడ్డ సమాధాన పరుస్తోంది. 'అది కాదు.. కోల్‌కతా ఘటన తర్వాత ఇలా జాగ్రత్తలు చెప్పాల్సి వస్తోంది బిడ్డా...!' అంటూ ఆ తండ్రి మాట్లాడుతుంటే.. 'నాన్నా.. మీరేం భయపడకండి. మేము బాగానే ఉంటాం. మీరు చెప్పినట్లు జాగ్రత్తలు తీసుకుంటాం..' అని ఆ బిడ్డ భరోసా ఇస్తోంది. ఇలా.. ఆడపిల్లలు ఉన్న ఎన్నో కుటుంబాలను కోల్‌కతా ఘటన కలవరపెడుతోంది. నిర్భయ, అభయ.. ఇప్పుడు కోల్‌కతాలో మరో ఆడబిడ్డ అతిదారుణంగా ప్రాణాలు కోల్పోయారు. ఇలా ఇంకా ఎన్ని అఘాయిత్యాలు జరగాలన్న ప్రశ్నలు వస్తున్నాయి. జిల్లా వైద్యులూ ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. 24 గంటలపాటు ఓపీసేవలు నిలిపివేయాలని నిర్ణయించారు.

నిర్భయను మించిన దారుణం..

నిర్భయ, అభయలను మర్చిపోకముందే.. అంతకు మించిన దారుణం. మరో చదువులతల్లిని అతికిరాతకంగా మానవమృగాలు పొట్టనబెట్టుకున్న వైనం. తను పనిచేస్తున్న ఆస్పత్రిలోనే ప్రాణాలను కాపాడే వైద్యురాలిని అత్యంత దారుణంగా అత్యాచారం చేసి చంపేశారు. కాళ్లు చేతులు విరిచేసి, ముక్కు, మొహం, గొంతుపైన పిడిగుద్దులు గుద్దుతూ.. కళ్లు, చెవుల్లోంచి రక్తాలు కారుతుండగా అత్యంత పాశవికంగా లైంగికదాడి చేసిన తీరు అందరినీ కలచివేస్తోంది.

శిక్షలను తలచుకుంటేనే వణకాలి..

మహిళలపై అత్యాచారం చేసినవారికి కఠినమైన శిక్షలు ఉండాలని, ఉరేస్తారన్న భయంతో వారు వణకాలని సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్రమోదీ స్వాతంత్ర్య దినోత్సవ వేదిక మీదుగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అంతలా కోల్‌కతా ఘటన దేశాన్ని కలచివేస్తోంది. అకృత్యాలకు పాల్పడేవారికి అత్యంత కఠిన శిక్షలను విధించాలని, ఉరి తీసినా తప్పులేదని జిల్లా మహిళలు పేర్కొంటున్నారు.

24 గంటలు ఓపీ బంద్...

కోల్‌కతలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యాన్ని వైద్యులంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. సామాజిక మాధ్యమాలలో ఈ ఘటన గురించే కంటిన్యూగా పోస్టులు పెడుతున్నారు. కేవలం వైద్యులు మాత్రమే కాదు.. యావత్ సమాజం స్పందించాలని పిలుపునిస్తున్నారు. ఇదేక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 17(శనివారం) ఉదయం 6 గంటల నుంచి 18(ఆదివారం) ఉదయం 6 గంటల వరకు ఓపీ (అవుట్ పేషెంట్) సేవలను బంద్ పెడుతున్నట్లు ఐఎంఏ నిర్మల్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి తెలిపారు. అత్యవసర వైద్యసేవలు అందిస్తామని పేర్కొన్నారు.

వైద్యులను కాపాడేదెవరు..



ప్రజలను కాపాడేందుకు వైద్యవృత్తిలోకి వచ్చిన యువతిని దారుణంగా చంపేశారు. ప్రజలను కాపాడేందుకు డాక్టర్లు ఉన్నారు. మరి డాక్టర్లను ఎవరు కాపాడుతారనే దానిపై చర్చించాలి.

– డాక్టర్ స్వర్ణారెడ్డి, ప్రసూతి వైద్యురాలు

ఇలాంటి దారుణాలు జరగొద్దు..



వైద్యురాలిని కావాలని ఎన్నో కలలు కని, బాగా చదివి వృత్తిలోకి అడుగు పెట్టిన యువతిని దారుణంగా హతమార్చారు. ఇలాంటివి జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ స్వప్న, పిల్లల వైద్యురాలు

అందరూ స్పందించాలి..



నిర్భయ, అభయ వంటి ఘటనలను మర్చిపోకముందే కోల్‌కతాలో దారుణ ఘటన చోటుచేసుకోవడం కలవరపెట్టే విషయం. ఇలాంటి వాటిని సమాజం ఖండించాలి.

– డాక్టర్ అనిత, ప్రసూతి వైద్యురాలు

సీరియస్‌గా తీసుకోవాలి..



కోల్‌కతా ఘటనపై దేశ వ్యాప్తంగా వైద్యులంతా ఆందోళన చేపడుతున్నాం. ఈ ఘటనపై అందరూ సీరియస్‌గా స్పందించాలి. నిందితులకు కఠినశిక్ష పడేలా చూడాలి.

– డాక్టర్ వివేక, డెంటల్ సర్జన్

మహిళల రక్షణకు చర్యలు..



సమాజంలో మహిళల పరిస్థితి దారుణంగా మారుతోంది. కోల్‌కతా ఘటన చాలామంది తల్లిదండ్రులనూ కలవరపెడుతోంది. మహిళల రక్షణకు కఠిన చర్యలు చేపట్టాలి.

– వీణారెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్

ఆత్మరక్షణ విద్యనూ అందించాలి..



ఆడపిల్లలు, మహిళలపై అఘాయిత్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. వాటిని అరికట్టేలా కఠిన చట్టాలు తీసుకురావాలి. ఆడపిల్లలకు ఆత్మరక్షణ విద్య అందించాలి.

– సుహాసిని, పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు

చట్టం వదలిపెట్టదు..



కోల్‌కతాలో వైద్యురాలి ఘటన అందరినీ కలచివేస్తోంది. దోషులైన మానవమృగాలను చట్టం వదలదు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులున్నా పోలీసులను సంప్రదించాలి. –జానకీషర్మిల, ఎస్పీ

సమాజం ఖండించాలి..



కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యం దారుణం. నిర్భయకన్నా దారుణంగా చంపేశారు. దీనిపై వైద్యులు మాత్రమే కాదు.. యావత్ సమాజం స్పందించాలి. – డాక్టర్ అప్పాల చక్రధారి, ఐఎంఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- ఆర్డీవో కోమల్‌రెడ్డి



ఆక్రమణపై గ్రామస్తులతో చర్చిస్తున్న ఆర్డీవో

ముధోల్: ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో కోమల్‌రెడ్డి హెచ్చరించారు. ముధోల్ బస్టాండ్ సమీపంలోని ఖజానా చెరువు నాలా ప్రాంతాన్ని ఆక్రమించినట్లు ఫిర్యాదు రావడంతో శుక్రవారం పరిశీలించారు. చెరువు నుంచి విడుదల అయిన నీరు పోయే కాలువను ఆక్రమించడంతో నీరు రోడ్డుమీదకు చేరి బురదగా మారుతోందని గ్రామస్తులు ఫిర్యాదు చేయగా పరిశీలించి, గ్రామస్తులతో చర్చించారు. అనంతరం రెవెన్యూ అధికారులు, పోలీసులతో చర్చించి జేసీబీ సహాయంతో నాలాను పునరుద్ధరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, సీఐ మల్లేశ్, ఎస్సై సాయికిరణ్, రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

భైంసాలో నేడు ప్రైవేట్ ఓపీ సేవలు బంద్

భైంసాటౌన్: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచార ఘటనను నిరసిస్తూ శనివారం ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిపేయనున్నట్లు ఐఎంఏ భైంసా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ రాజేశ్వర్‌రావు, డాక్టర్ సూర్యకాంత్‌రెడ్డి తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్న డిమాండ్‌తో ఐఎంఏ దేశవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఓపీ సేవలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైద్యులు 28 మంది.. విధుల్లో 8 మందే..

- భైంసా ఏరియాస్పత్రిలో రోగుల దైన్యం
- శుక్రవారం ఒక్కరోజే 650 ఓపీ నమోదు
- వైద్యుల సెలవు, డిప్యూటేషన్లతో అందని వైద్యసేవలు



వైద్యులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు



ఓపీ గది బయట బారులు తీరిన రోగులు

భైంసాటౌన్: డివిజన్ కేంద్రమైన భైంసా ప్రభుత్వ ఏరియాస్పత్రిలో సరైన వైద్య సేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకే పదుల సంఖ్యలో వైద్యులున్నా.. విధులకు వచ్చేది కొద్దిమంది మాత్రమే. అసలే వ్యాధుల సీజన్ కావడంతో ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. శుక్రవారం ఒక్కరోజే 650 వరకు ఓపీ నమోదు కాగా, ఉదయం వేళల్లో ఓపీలో ముగ్గురు వైద్యులు మాత్రమే అందుబాటులో ఉండగా, డాక్టర్‌కు చూపించుకునేందుకు రోగులు ఓపీ గదుల వద్ద బారులు తీరి కనిపించారు. వైద్యులు అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్న విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో, ఆమె వెంటనే స్థానిక అధికారులకు ఆస్పత్రిలో పరిస్థితిపై నివేదిక పంపించాలని కోరినట్లు తెలిసింది. దీంతో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని అందుబాటులో ఉన్న, సెలవులో ఉన్న వైద్యులు, రోగుల తాకిడి, తదితర వివరాలు తెలుసుకున్నారు.

సెలవులు, డిప్యూటేషన్లతో అవస్థలు...

భైంసా ప్రభుత్వ ఏరియాస్పత్రిలో మొత్తం 28 మంది వైద్యులు ఉండగా, వీరిలో ఒకరు ఇటీవల రాజీనామా చేశారు. బదిలీల్లో భాగంగా ముగ్గురు నిర్మల్ నుంచి బదిలీపై రాగా, వారు డిప్యూటేషన్‌పై నర్సాపూర్(జి)కి వెళ్లారు. ఇక 24 మంది వైద్యుల్లో నలుగురు లాంగ్‌లీవ్, ఇద్దరు మెడికల్ లీవ్‌లో ఉండగా, 18 మంది మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. వీరిలో మరో ఆరుగురు శుక్రవారం సెలవు పెట్టారు. నలుగురు పోస్ట్ డ్యూటీ కారణంగా విధులకు హాజరు కాలేదు. దీంతో కేవలం 8 మంది విధులకు హాజరయ్యారు. విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఇద్దరు సెలవు రద్దు చేసుకుని ఆస్పత్రికి చేరుకున్నట్లు తెలిసింది.

ఓపీ విధుల్లో సూపరింటెండెంట్

శుక్రవారం వైద్యులు సెలవులో ఉండడంతో స్కానింగ్ విధులు నిర్వహిస్తున్న ఏరియాస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్ ఓపీ గదికి చేరుకుని విధులు నిర్వహించారు. వైద్యులు లేక రోగుల ఇబ్బందిపై కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో వెంటనే ఆయన ఓపీకి చేరుకుని వైద్య సేవలు అందించారు. కొందరు వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తరచూ ఆస్పత్రిలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



ఓపీలో సేవలందిస్తున్న సూపరింటెండెంట్ కాశీనాథ్

ఒక్క డాక్టరే ఉన్నారు...



మోకాళ్ల నొప్పి ఉండడంతో ఉదయం ఆస్పత్రికి వచ్చాను. ఓపీ గది వద్ద డాక్టర్ ఒక్కరే ఉండడంతో రోగులు ఎక్కువగా ఉన్నారు. రెండుగంటలపాటు వేచి ఉన్నా. ఓపిక లేక పక్కన కూర్చున్నా.

– శేషరావు, సిద్దూర్

గంట నుంచి క్యూలో...



జ్వరం, ఒళ్లు నొప్పులతో ఆస్పత్రికి ఉదయం 10.30 గంటలకు వచ్చిన. ఓపీ చీటి తీసుకుని డాక్టర్ దగ్గరికి వస్తే ఒకరే డాక్టర్ ఉండడంతో క్యూ పెద్దగా ఉంది. చేసేది లేక గంటపాటు క్యూలోనే నిల్చున్న.

– శివరాం, జ్వర బాధితుడు, ఉమ్రి

ఇబ్బంది లేకుండా సేవలు..

రోగులకు ఇబ్బంది లేకుండా వైద్య సేవలందిస్తున్నాం. ప్రతీరోజు 15–18 మంది వైద్యులు అందుబాటులో ఉంటారు. వివిధ కారణాలతో కొందరు సెలవు శుక్రవారం పెట్టారు. ముగ్గురు డిప్యూటేషన్‌పై, నలుగురు లాంగ్‌లీవ్, ఇద్దరు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. ఓపీ ఎక్కువగా ఉండడంతో ఇద్దరు లీవ్ రద్దు చేసుకుని విధులకు వచ్చారు.

– డాక్టర్ కాశీనాథ్, ఏరియాస్పత్రి సూపరింటెండెంట్, భైంసా

సీజనల్ వ్యాధులను నియంత్రించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, జ్యోతిబాపూలే, కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. శాఖలవారీగా వసతి గృహాలలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో డెంగీ, టైఫాయిడ్, మలేరియా, చికున్‌గునియా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు విద్యా సంస్థల్లో పదివేల మంది విద్యార్థులకు జ్వర సర్వే నిర్వహించడం జరిగిందని, ప్రక్రియను నిరంతరం కొనసాగించాలన్నారు. వైద్య సిబ్బంది వసతి గృహాలలో మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. దోమలు వ్యాపించకుండా నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్, దోమల నివారణ రసాయనాల పిచికారీ ప్రక్రియ నిరంతరం కొనసాగించాలన్నారు. కిటికీలకు దోమ తెరలను అమర్చుకోవాలని తెలిపారు. అన్ని వసతి గృహాలు, పాఠశాలల్లో ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహించాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, ఎంపీపీలు, వైద్యాధికారులు సమన్వయంతో విద్యాసంస్థల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లోని ప్రతీ విద్యార్థికి రక్త పరీక్షలు నిర్వహించి, రక్తహీనత లోపం ఉన్న విద్యార్థులకు మందులు, ప్రత్యేక పోషకాహారం ఇవ్వాలన్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు విద్యార్థులతో కమిటీలు వేయాలని సూచించారు. గ్రామాల్లో విషజ్వరాలకు సంబంధించి కేసులు వస్తున్న ప్రాంతాలను గుర్తించి నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాన్ని ఈ వారంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ హైమద్, డీఈవో రవీందర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్, సంక్షేమ శాఖల అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, కేజీబీవీల ప్రత్యేక అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై చర్య తీసుకోవాలి

భైంసాటౌన్: ఖత్‌గాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులపై చర్య తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రెటరీ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం భైంసాలో మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలలో గురువారం జాతీయజెండా ఎగురవేయలేదని తెలిపారు. విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

కాలుజారి పొలంలో పడి రైతు మృతి


ఎల్లయ్య (ఫైల్)

కుంటాల: వ్యవసాయ పనులకు వెళ్లిన రైతు ప్రమాదవశాత్తు పంట పొలంలో జారి పడి మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని అందాకూర్ గ్రామానికి చెందిన బర్కుంట ఎల్లయ్య శుక్రవారం తన భూమితోపాటు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న పొలం వద్దకు వెళ్లాడు. ఇప్పటికే అనారోగ్యంతో ఉన్న ఎల్లయ్య పొలం తిరిగే క్రమంలో కాలు జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఏఎస్సై దేవ్‌రావు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య గంగవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి గ్రామానికి చెందిన వృద్ధుడు తాళ్ల లక్ష్మణ్ (64) చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు, ఏఎస్సై మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. ద్విచక్రవాహనంపై వెళ్తున్న తాళ్ల లక్ష్మణ్ బుధవారం రాత్రి గ్రామ సమీపంలో ఎడ్లబండిని తప్పించేక్రమంలో కిందపడ్డాడు. గాయపడ్డ అతడిని గమనించిన స్థానికులు చికిత్స కోసం భైంసాలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నాందేడ్‌లోని ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య గంగామణి, కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి..


మోహన్ (ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని నర్సింహనగర్ తండాకు చెందిన జాదవ్ మోహన్ (33) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. జాదవ్ మోహన్ ఏ పనీ చేయకుండా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 11న తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. మృతుడికి భార్య శోభాబాయి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శోభాబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)

సోన్: కుటుంబ కలహాలతో ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాధాపూర్ గ్రామానికి చెందిన పోన్నన శ్రీనివాస్ (46) వ్యవసాయ కూలీగా, ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంత కాలంగా తరచూ మద్యం తాగి భార్యతో గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లున్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

తలమడుగు: పురుగుల మందు తాగి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అంగ లక్ష్మి (67) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈక్రమంలో మనస్తాపం చెంది గురువారం ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ గోపాల్ తెలిపారు.

‘హోమియో’పై చిన్నచూపు


మూతపడ్డ ఉట్నూర్‌లోని ప్రభుత్వ హోమియో ఔషధాలయం

- మూతపడ్డ ఉట్నూర్ ఔషధాలయం
- ఉమ్మడి జిల్లాలో ఎనిమిది కేంద్రాలు
- ఒకే డాక్టర్, ముగ్గురే ఫార్మసిస్టులు
- సేవలందక ఇబ్బందుల్లో రోగులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణంలోని ప్రభుత్వ హోమియో ఔషధాలయం మూతపడింది. 20రోజుల క్రితం ఇక్కడ విధులు నిర్వహించిన డాక్టర్, ఫార్మసిస్టులు బదిలీపై వెళ్లగా తిరిగి ఎవరినీ నియమించలేదు. ఈ ఔషధాలయానికి జన్నారం, కడెం, ఇంద్రవెల్లి, నార్నూర్, కెరమెరి, జైనూర్ మండలాల నుంచి దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు వస్తుంటారు. వైద్యులు లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. హోమియో ఔషధాలయాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, వాతం, చర్మవ్యాధులు, కాలానుకుగుణంగా సంక్రమించే వ్యాధులు పూర్తిగా నయమయ్యేందుకు ఈ ఔషధాలు ఉపయోగపడతాయని హోమియో వైద్యులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఒకే డాక్టర్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎనిమిది హోమియో ఔషధాలయాలున్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండలం ఉషేగాం, సిర్పూర్(టీ), ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని పొన్కల్, కడ్తాల్, దహెగాం, బాసరలలో ఈ ఔషధాలయాలున్నాయి. వీటిలో ఒకే డాక్టర్, ముగ్గురు ఫార్మసిస్టులు మాత్రమే పనిచేస్తున్నారు. మూడు మూడు రోజులకోసారి ఒక్కో ఔషధాలయాన్ని ఉన్న సిబ్బందితో కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో డాక్టర్లు, ఫార్మసిస్ట్, సిబ్బంది నియమించి ఔషధాలయాలను కొనసాగించాలని దీర్ఘకాలిక రోగులు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి



హోమియో ఔషధాలయాల్లో పూర్తి స్థాయిలో డాక్టర్లు, సిబ్బందిని నియమించాలి. దీర్ఘకాలిక రోగాలకు హోమియో వైద్యం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ వైద్యశాల ద్వారా మందులు అందించి ఆరోగ్య సమస్యల నుంచి తప్పించాలి.
– మొహమ్మద్ ముజీబ్, దంతన్‌పల్లి

అందుబాటులోకి తేవాలి



ఏజెన్సీ ప్రాంతంలో డాక్టర్, సిబ్బంది లేక ఉట్నూర్ హోమియో ఔషధాలయం మూతపడింది. ఆయా మండలాల నుంచి వచ్చే రోగులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ కేంద్రం ద్వారా సేవలందించాలి.
– పుర్క బాపురావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు

‘రుణమాఫీ పేరుతో సర్కారు దగా’


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుప్తా

గుడిహత్నూర్: రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా ఆరోపించారు. మండల కేంద్రంలోని శివ కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి రైతు రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో భాగంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చాక విస్మరించిందని ఆరోపించారు. రైతు భరోసా ఊసే లేదని విమర్శించారు. ఫసల్ బీమా యోజన వాటా డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించలేదని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తీవ్రంగా నష్టపోయిన రైతాంగం కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అవే ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వమే రైతులకు అండగా నిలుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, ఆదిలాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మయూర్ చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి వకుళాభరణం ఆదినాథ్, నాయకులు బాబారావు పాటిల్, కేంద్రే లక్ష్మణ్, మాధవరావు ఆమ్టే, వామన్ పటేల్ గిత్తే, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ మండలాల పార్టీ అధ్యక్షులు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న కడియం శ్రీహరి


మనవరాలికి అక్షరాభ్యాస పూజ చేయిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

బాసర: నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారిని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరం, ఎంపీ కావ్య శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు మంగళవాయిద్యాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అక్షరాభ్యాస మండపంలో శ్రీహరి మనవరాలికి అక్షరాభ్యాస పూజను ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్‌పాఠక్ జరిపించారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆశీర్వచన మండపంలో అర్చకులు వారిని ఆశీర్వదించి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయరామారావు, బాసర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మమ్మాయి రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి


పోటీలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ అశోక్‌కుమార్


తలపడుతున్న క్రీడాకారులు

ఆదిలాబాద్: ఆటల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని టీజీఎస్పీడీసీఎల్ వరంగల్ హెచ్‌డీఆర్ డైరెక్టర్ బీ అశోక్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం టీజీఎన్పీడీసీఎల్, టీజీ ట్రాన్స్‌కో, టీజీఎస్పీడీసీఎల్, డిస్కం సంస్థల ఇంటర్ సర్కిల్ టోర్నమెంట్ 2024–25 వాలీబాల్, క్యారమ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. ఎదుటివారి గెలుపుని స్ఫూర్తిగా తీసుకుని, తమ వైఫల్యాలకు కారణాలు తెలుసుకుని సామర్థ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే విద్యుత్ ఉద్యోగులకు మానసికోల్లాసాన్ని కలిగించాలనే ఉద్దేశంతో టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ ఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పోటీలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. పని ఒత్తిడికి లోనుకాకుండా క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి ఆటలు ప్రోత్సాహకంగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్, జగన్నాథ్ తదితరులున్నారు.

వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూ

సాక్షి స్పందన

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో నాలుగు ప్రత్యేక వైద్యుల పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించడం కోసం ఈ నెల 23న కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ ఉపేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 29న ‘సాక్షి’లో ప్రచురితమైన ‘పేరుకే జిల్లా ఆసుపత్రి’ కథనానికి స్పందించిన కలెక్టర్ వైద్య పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారు. ఖాళీగా ఉన్న జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్ సర్జన్, ఎనిస్తీషియా, ఫలమ్నాలజీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులు దరఖాస్తులను ఆదిలాబాద్‌లోని సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9849878635, 9490024909 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సొసైటీ చైర్మన్‌పై ఫిర్యాదు


డీసీవోకు ఫిర్యాదు చేస్తున్న డైరెక్టర్లు

బోథ్: విధులను నిర్లక్ష్యం చేస్తున్న బోథ్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్‌లను పదవుల నుంచి తొలగించాలని కాంగ్రెస్‌కు చెందిన సంఘం డైరెక్టర్లు శుక్రవారం ఆదిలాబాద్‌లో జిల్లా కోఆపరేటివ్ అధికారి (డీసీవో)కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదు పత్రాన్ని ఆయనకు అందజేశారు. వారు మాట్లాడుతూ.. గత డిసెంబర్‌లో మహాజన సభ నిర్వహించారని తెలిపారు. అప్పటి నుంచి మళ్లీ మహాజనసభ, సాధారణ సమావేశాలు నిర్వహించలేదని, చైర్మన్ అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. వారిని పదవుల నుంచి తొలగించాలని కోరారు. డీసీవోను కలిసినవారిలో సొసైటీ డైరెక్టర్లు గొర్ల రాజుయాదవ్, లోలపు పోశెట్టి, చట్ల ఉమేశ్, ద్యాగల నారాయణ తదితరులున్నారు.

ఏజెన్సీ రైతుల రుణాలు మాఫీ చేయాలి

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ ప్రాంత రైతుల రుణాలు మాఫీ చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు భరత్ చౌహాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని టీజీబీ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనేతర రైతులకు రుణమాఫీ చేయాలని, కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకూ రుణమాఫీ చేయాలని, రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులతో పాటు వివిధ కులాల వారు నివసిస్తున్నారని, ప్రభుత్వం గిరిజన, గిరిజనేతర రైతులకు పహాణీలు ఇచ్చిందని తెలిపారు. వాటిని బ్యాంకుల్లో పెట్టి రైతులు రుణాలు తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వీరి రుణాలు మాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

మృతదేహానికి రీపోస్టుమార్టం


మృతదేహాన్ని వెలికితీస్తున్న సిబ్బంది

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని బురదగూడ గ్రామానికి చెందిన కొట్టంగి సాంబయ్య అలియాస్ శ్యాంరావు మృతదేహానికి శుక్రవారం అధికారులు రీపోస్టుమార్టం నిర్వహించారు. వివరాలు.. మంచం పైనుంచి కింద పడి గాయాలపాలై ఈనెల 3న ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సాంబయ్య తల్లి భీంబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ ఎస్సై సోనియా కేసు నమోదు చేశారు. అయితే మృతిపై పలు అనుమానాలున్నాయని కొంతమంది గ్రామస్తులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్డీవో సురేశ్ సమక్షంలో కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు, ఎస్సై మహేందర్ సిబ్బందితో మృతదేహాన్ని వెలికితీశారు. మంచిర్యాల మెడికల్ కళాశాలకు చెందిన ఇద్దరు ఫోరెన్సిక్ నిపుణులు మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించారు. ఈ ప్రక్రియను కుటుంబీకులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, పోలీసులు వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. అనంతరం డీఎస్పీ కరుణాకర్ మాట్లాడుతూ.. సాంబయ్య మృతిపై పలు అనుమానాలు ఉండటంతో రీపోస్టుమార్టం చేశామని తెలిపారు. ఫోరెన్సిక్ నిపుణులు ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గల్ఫ్ బాధితుడి ఆచూకీ కనుగొనే దిశగా..

- ఒంటెలకాపరి ఎడారి లొకేషన్ గుర్తింపు
- రక్షణకు కువైట్, సౌదీల్లోని ఇండియన్ ఎంబసీల ఉమ్మడి ఆపరేషన్


రాథోడ్ నాందేవ్ (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఇటీవల సెల్ఫీ వీడియోతో సంచలనం సృష్టించిన ఎడారిదేశంలో ఉన్న ఒంటెల కాపరి ఆచూకీ కనుగొనే దిశగా ప్రయత్నం సాగుతోంది. నిర్మల్ జిల్లా ముధోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన లంబాడా గిరిజనుడు రాథోడ్ నాందేవ్ డొమెస్టిక్ వీసాపై కువైట్‌కు వెళ్లగా అక్కడి అరబ్ యజమాని అతడిని అక్రమంగా దేశ సరిహద్దు దాటించి సౌదీ అరేబియా ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేయించుకుంటున్న ఉదంతం ఇటీవల వెలుగు చూసింది. ఈ మేరకు నాందేవ్ భార్య లక్ష్మి భారత విదేశాంగశాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. బాల్కొండ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ ఈ విషయాన్ని టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీమ్‌రెడ్డితో కలిసి ఎంబసీతో సహా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా, ప్రవాసీమిత్ర కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల తెలిపిన వివరాల ప్రకారం.. రాథోడ్ నాందేవ్ సౌదీ అరేబియా ఈస్టర్న్ ప్రావిన్స్‌లోని ఖఫ్జి పట్టణం సమీపంలోగల ఎడారిలో ఉన్నట్లు తెలుస్తోంది. నాందేవ్ వాట్సాప్‌లో తన లొకేషన్ మ్యాపును అతడి భార్య లక్ష్మికి షేర్ చేయడంతో ఈ విషయం నిర్ధారణ అయింది. కువైట్ సిటీకి 160 కిలో మీటర్ల దూరంలో అల్ వఫ్రా సమీపంలో గల సౌదీ అరేబియాలోని పర్షియన్ గల్ఫ్ సముద్ర తీరంలో ఖఫ్జి అనే పట్టణం ఉంది. కువైట్ వీసా కలిగిన భారతీయుడిని సౌదీ అరేబియా భూభాగం నుంచి రక్షించడంలో కొన్ని సాంకేతికమైన, న్యాయపరమైన చిక్కులున్నాయి. కువైట్‌లోని ఇండియన్ ఎంబసీ, సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని ఇండియన్ ఎంబసీలు ఈ కేసులో సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఢిల్లీలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సూచనల మేరకు కువైట్, సౌదీ ప్రభుత్వాలను సంప్రదిస్తున్నారు. అనుమతి లేకుండా, పొరపాటున దేశాల సరిహద్దులు దాటినప్పుడు అనుసరించాల్సిన అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్వోపీ) ను పాటిస్తూ నాందేవ్‌ను స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా, టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీమ్‌రెడ్డి వాట్సాప్, ఐఎంవో ద్వారా సౌదీలో ఉన్న ఒంటెల కాపరి రాథోడ్ నాందేవ్‌తో మాట్లాడి ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాధిత గల్ఫ్ కార్మికుడు తన ఎడారి దుర్భరజీవితం గురించి వివరించినట్లు తెలిపారు. నాందేవ్ ప్రతీరోజు దాదాపు 40 ఒంటెలను ఎడారిలో మేపడం, నీళ్లు మేత ఇవ్వడం లాంటి పనులు చేస్తున్నాడని పేర్కొన్నారు. ఒక్కోసారి అరబ్ యజమానులు నాందేవ్‌ను కొడుతున్నట్లు తెలిపారు. అనారోగ్యం పాలైతే ఆస్పత్రికి కూడా తీసుకెళ్లడంలేదని చెప్పారు. నాందేవ్‌కు కొడుకు, కూతురు ఉండగా కూతురికి ఇటీవలే పెళ్లియిందని, కొడుకు తెలంగాణ విశ్వవిద్యాలయంలో పీజీ చదువుతున్నాడని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్ కోసం, స్వదేశంలో సరైన ఉపాధి అవకాశాల్లేకనే గల్ఫ్ బాట పట్టానని నాందేవ్ ఆవేదన వ్యక్తం చేసినట్లు కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు.



గల్ఫ్ కార్మికుడి ఆచూకీ తెలిపే గూగుల్ లొకేషన్

బాలికను వేధించిన ఒకరికి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలికను పెళ్లి చేసుకోవాలని వేధించిన కేసులో నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరుసకు బావ అయిన వ్యక్తి మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బాలికను తనను పెళ్లి చేసుకోవాలని వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 13న కిరాణాషాప్‌నకు వెళ్లిన బాలికను చెయ్యి పట్టి లాగాడు. దీంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కారును ఢీకొట్టిన లారీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని కుమురంభీం చౌక్‌లో శుక్రవారం ఉదయం రిమ్స్ వైపు నుంచి గాంధీ పార్క్ వైపు వెళ్లే క్రమంలో వెనుక నుంచి లారీ కారును ఢీకొట్టింది. దీంతో కారు ధ్వంసమైంది. అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాలేదు. కాగా, పట్టణంలోని తిరుమలనగర్‌కు చెందిన కారు యజమాని చంద గణేశ్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారుబోల్తా


ధ్వంసమైన కారు

సారంగపూర్: మండలంలోని చించోలి(బీ) ఎక్స్‌రోడ్డు వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడటంతో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు.. సారంగపూర్‌కు చెందిన లింగం తన కారులో నిర్మల్ నుంచి సారంగపూర్‌కు వస్తున్నాడు. వర్షం కారణంగా కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో లింగంకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే కారును బయటకు తీసి లింగంను ఆస్పత్రికి తరలించారు.

కలెక్టర్ వాహనం ఎదుట ఆందోళన

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్


ఆందోళనకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పూర్తిస్థాయి రెగ్యులర్ వైద్యులను నియమించాలని, హస్నాపూర్ చౌరస్తా నుంచి ఎల్లాపూర్ వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రానికి వచ్చిన కలెక్టర్ రాజర్షి షా వాహనం ఎదుట బీజేపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. నినాదాలతో హోరెత్తించారు. ఆందోళన చేస్తున్న వారి వద్దకు కలెక్టర్ వచ్చి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు లేక రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, చిన్న సమస్య వచ్చినా ఉట్నూర్ లేదా ఆదిలాబాద్‌కు రెఫర్ చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రెగ్యులర్ వైద్యులను నియమించాలని కోరారు. హస్నాపూర్ చౌరస్తా నుంచి గాదిగూడ ఎల్లాపూర్ వరకు సరైన రోడ్డు లేక తరచూ ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని కలెక్టర్‌కు తెలిపారు. హస్నాపూర్ చౌరస్తా నుంచి గాదిగూడ ఎల్లాపూర్ వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. వారం రోజుల్లో ఇద్దరు వైద్యులను డిప్యూటేషన్‌పై నియమిస్తామని, త్వరలో రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ఆందోళన విరమించారు. పార్టీ జిల్లా నాయకుడు భిక్షపతి రాథోడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చాలుకర్ ప్రకాశ్, మండలాధ్యక్షుడు తొడసం బండు, పేసా చట్టం కోఆర్డినేటర్ రాథోడ్ సికిందర్, తాజా మాజీ ఉపసర్పంచ్ చౌహాన్ మహేందర్ తదితరులున్నారు.

అటల్‌జీ కీర్తి అజరామరం

- ఎంపీ గోడం నగేశ్


వాజపేయికి నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి కీర్తి అజరామరం అని ఎంపీ గోడం నగేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అటల్‌జీ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. వాజ్‌పేయి దేశ ప్రధానిగా అన్ని వర్గాల మన్ననలు పొందారని కొనియాడారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అనుసంధానానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. మాజీ ప్రధాని వాజపేయికి ఆదిలాబాద్‌తో అవినాభావ సంబంధం ఉందని తెలిపారు. ఆయన ప్రధానిగా ఉన్నపుడు ఆదిలాబాద్ జిల్లా మీదుగా నాలుగులేన్ల జాతీయ రహదారి నిర్మాణం పూర్తయిందన్నారు. ఇంటింటికీ తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో స్వజల ధార పథకాన్ని జిల్లాలోని అవాల్‌పూర్ గ్రామం నుంచి పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించారని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పార్టీ కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాయకులు లాలామున్నా, జోగు రవి, ప్రవీణ్, దినేశ్ మటోలియా, మహేందర్, ముకుందరావు, రాజు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి కనిపించిన చిరుతపులి

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన ఓ యువకుడికి చించోలి హనుమాన్ ఆలయం వద్ద చిరుత పులి కనిపించింది. యువకుడు తెలిపిన వివరాల ప్రకారం.. సొనాల గ్రామానికి చెందిన ఓ యువకుడు సొనాల గ్రామం నుంచి నిర్మల్‌కు శుక్రవారం కారులో వెళ్తున్నాడు. నేరడిగొండ మండలం చించోలి గ్రామ సమీపంలో గల హనుమాన్ ఆలయం దాటి రోడ్డుకు కుడి వైపున చిరుత పులి కూర్చుని ఉంది. దీంతో సదరు యువకుడు భయభ్రాంతులకు గురయ్యాడు.